

# అవగాహన

ముద్దంశెట్టి హనుమంతరావు

చంద్రం ఉత్సాహంగా, హుషారుగా ఇంట్లోపలికి వచ్చాడు. ఆనందం, అతని కళ్లల్లో మెరుస్తోంది. అందుక్కారణం, అతడు పదో తరగతి ఫస్టుక్లాసులో పాసవ్వడమే!

కొడుకు అంత వుత్సాహంగా, ఆనందంగా రావడం, తల్లిదండ్రులు జయకి, స్వామికి సంతోషం కలిగించింది.

"ఏమయ్యిందిరా!" ఆసక్తిగా అడిగింది జయ.

"పాసయ్యానమ్మా! ఫస్టుక్లాసులో పాసయ్యాను" అన్నాడు చంద్రం.

జయ, కొడుకుని ఆప్యాయంగా దగ్గరికి తీసుకుంది.

"మా నాయనే, నా బాబే, మనింటి పేరు నిలబెట్టావురా..." అంటూ భర్తకేసి తిరిగింది జయ.

"చూశారా, మనవాడు ఫస్టుక్లాసులో పాసయ్యాడట..." అంది సగర్వంగా.

"చాలా సంతోషంరా చంద్రం..." ముక్తసరిగా అన్నాడు స్వామి.

"ఇప్పుడేదో అన్నారుగాని, ఎప్పుడైనా, ఏ ఒక్కరోజయినా వాణ్ణి మెచ్చుకున్నారా? లేదే! వాడు చదవడం లేదనే ఎల్లప్పుడూ గొణిగేవారు" భర్తని నిందిస్తూ అంది జయ.

సాధారణంగా, తండ్రులకు పిల్లల పట్ల, వాత్సల్యంతో పాటు బాధ్యతలుంటే, తల్లులకు మమతానురాగాలుంటాయి. ఆ దృక్పథంతో అంది జయ.

సన్నగా నవ్వేడు స్వామి. "నేనెప్పుడూ వాడి

బాగోగులు, భవిషత్తును కాంక్షించి, కష్టపడి చదవమనే వాణ్ణిగాని, వాడిపై మమకారం లేక కాదు. వాడిపై కక్షతోనూ కాదు. వాడి పట్ల నాకో బాధ్యత వుండేది... దాన్ని నువ్వెందుకు అర్థం చేసుకోవు జయా? వాడిప్పుడు ఫస్టు క్లాసులో పాసయ్యాడు. నాకు ఎంతో ఆనందంగా వుంది" అంటూ కొడుకు వైపు తిరిగి--

"ఒరేయ్ చంద్రం, ఇంతకీ నీకు ఎన్ని మార్కులు వచ్చాయిరా?" అన్నాడు స్వామి.

"నాలుగు వందల నలభై వచ్చాయి నాన్నా!"

"అంటే, ఈ మార్కులు ఆరువందలకి కదా?"

"ఔను నాన్నా..."

"నీలా ఫస్టు క్లాసులో పాసైనవాళ్లు చాలామంది వుంటారనుకుంటాను. ఏంరా?"

"ఔను చాలామంది వున్నారు..."

"అయిదు వందల మార్కులకి పైబడి వచ్చిన వాళ్లు మీ స్కూల్లో ఉన్నారా?"

"ఉన్నారు నాన్నా! పది, పన్నెండు మంది వుంటారు!"

"అలాగా! ఆ పది, పన్నెండు మందిలో నువ్వు ఒక్కడివై వుంటే, నేను మరీ ఆనందించే వాణ్ణిరా చంద్రం. ఏమైతేనేం నువ్వు ఫస్టు క్లాసులో పాసైనందుకు కంగ్రాచ్యులేషన్స్. కీపిటప్..." అనేస్తూ, అక్కణ్ణించి వెళ్లిపోయాడు స్వామి.

చంద్రం తెల్లబోయాడు తండ్రిమాటలకు, తల్లికేసి చూశాడు.

"అమ్మా, నేను ఫస్టుక్లాసులో పాసైనా, నాన్నకి సంతృప్తికరంగా లేదేమిటే, అయిదువందలు పైబడి మార్కులు వచ్చి వుంటే మరీ ఆనందించేవాణ్ణంటున్నాడేమిటి?" నిరుత్సాహంగా అన్నాడు చంద్రం.

"మీ నాన్నగారు అంతేలేరా! నువ్వేం బాధపడకు. అలా అంటే నువ్వు ఇంకా శ్రద్ధగా చదువుతావని ఆయన వుద్దేశం..." కొడుకుని సమాధానపర్చింది.

"అమ్మా... అమ్మా..." మారాంగా అన్నాడు చంద్రం.

"ఏమిట్రా?"

"మరేం... నేను ఇంజనీరింగు చదువుతానే..." అన్నాడు.

"అలాగేలేరా! నువ్వు ఇంజనీరు నవుతానంటే, మాకు మాత్రం ఆనందంగా వుండదూ, కష్టపడి చదువు..." అనేసింది జయ.

"దానికి ఇప్పట్నుంటే కోచింగు క్లాసులు చదవాలే..."

"చదువు, దానికేం? ఎవరొద్దన్నారురా?"

"అది మామూలు చదువు కాదే! రెండేళ్లపాటు కోచింగు సెంటర్లో చదవాలి. అప్పుడు పరీక్షకు కూచుంటే, అందులో మంచి మార్కులు తెచ్చుకుంటే, ఇంజనీరింగు చదవడానికి, అవకాశం వుంటుంది. మా స్నేహితులు చాలామంది ఆ కోచింగు సెంటర్లో చేరడానికి నిర్ణయించుకున్నారు."

"అయితే, నువ్వు చేరిపోరా! దానికేం భాగ్యం..." తేలిగ్గా అనేసింది జయ.

తల్లి తెలియనితనానికి, నవ్వుకున్నాడు, చంద్రం. "అది, అంత సులువు కాదమ్మా. బోలెడు డబ్బు ఖర్చవుతుంది..." అన్నాడు.

"డబ్బు ఖర్చవుతుందా!"

"ఔనమ్మా..."

"ఎంతవుతుంది?"

"ప్రతీ ఆరునెలలకీ, పదిహేనువేలు పైచిలుకే కట్టాలమ్మా..."

ఆశ్చర్యపోయింది జయ. ఆమెకి అంతవరకూ తెలీని విషయం అది.

"అంత డబ్బే?" కళ్లింతలు చేసుకొని, వింతగా అడిగింది.

"ఔనమ్మా! ఇవన్నీ నీకు తెలీవులే. నాన్నకి తెలుసు. నేను ఇంజనీరునై బాగా డబ్బు సంపాదించాలంటే, ఇప్పుడు నా చదువుకి ఖర్చు పెట్టాలికదమ్మా! రాజకీయ నాయకులుచూడు, తర్వాత ఎంతో డబ్బు సంపాదించవచ్చని ఎలక్షన్లో లక్షలకి లక్షలు ఖర్చు పెడుతూ వుంటారు. అది, నీకు తెలిసిన విషయమే కదా!"

"ఔననుకో.. కాని, మనం అంత డబ్బు ఖర్చుపెట్టగలమా?" అంది జయ, సాలోచనగా సందేహిస్తూ.

"అలా అనుకుంటే, నా భవిషత్తు, మాటేమిటమ్మా? అమ్మా, నువ్వే నా భవిషత్తుకి బంగారు బాట వెయ్యాలమ్మా!" మురిపెంగా అన్నాడు చంద్రం.

జయలోని తల్లి మనస్సు కరిగిపోయింది. కోరక కోరక, కొడుకు ఒక కోరిక కోరాడు. కాని, ఆ కోరిక అంత సామాన్యమైనది కాదు... ఖరీదైన కోరిక... ఏం చెయ్యడమో ఆమెకి తోచలేదు. ఔననలేదు... కాదనలేదు... ఆలోచనల్లో పడింది.

"ఏమిటమ్మా ఆలోచిస్తున్నావు?" ఆసక్తిగా ప్రశ్నించాడు చంద్రం.

"అబ్బే, ఏం లేదురా! మీ నాన్నగారితో చెప్పు. డబ్బు ఇచ్చేది ఆయనే కదా!" అంది.


"వుహూ! నేను చెప్పలేనమ్మా! నువ్వే నాన్నకి నచ్చ చెప్పాలి..." అన్నాడు చంద్రం.

"సరే! నేనే చెబుతాన్లే... నువ్వెళ్లి కాళ్లు చేతులు కడుక్కొని రా! భోంచేద్దువుగాని..." మందహాసంతో అంది జయ.

చంద్రం హృదయం వుప్పొంగిపోయింది.

"మా మంచి అమ్మ" అంటూ తల్లిని కౌగిలించుకున్నాడు.

"పిచ్చి సన్నాసి..." ముసిముసి నవ్వుతూ, కొడుకు తల నిమిరింది.



## టెలిఫోన్‌లో కథలు

బంధువులతోనో, స్నేహితులతోనో మాట్లాడటానికి మాత్రమే ఫోన్ ఉపయోగించే కాలంలోనే మనమింకా వున్నాం. అయితే అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా దేశాలు ఈ విషయంలో మరో అడుగు ముందుకేసి ఫోన్లను కాస్తా చందమామ పుస్తకాలుగా మార్చేస్తున్నాయి. పనుల ఒత్తిడీ, అలసటతో మానసికమైన ఒత్తిడీ కలిగినప్పుడు, మనశ్శాంతి కరవై కథలు చదివి కాలక్షేపం కోరుకునేవారు, కథల పుస్తకాల కోసం పరుగెత్తే అవసరం లేదు. ఇంట్లోనే, జస్ట్ ఒక నంబర్‌ను డయల్ చేస్తే చాలు. అవతలి వైపు నుంచి కోరుకున్నంత సేపూ మధురకంఠంతో మెత్తగా కథలు వినిపిస్తాయి. టెలిఫోన్ శాఖ వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టెలిఫోన్ కథలు వినేందుకు బిల్లు కాస్త ఎక్కువే అయినా, "ఆ కథలు కలిగించే ప్రశాంతత ముందు ఈ బిల్లెంత ఆఫ్టరాల్?" అంటున్నారు ఫోన్ శ్రోతలు. ఎంతైనా సంపన్నదేశాల ప్రజ కదా మరి!

బి.జి.



చంద్రం బాత్రూమ్ కేసి నడిచాడు.

000

మర్నాడు, ఉదయం తొమ్మిది గంటలకి స్వామి ఆఫీసుకి వెళ్లే ముందు భోజనం చేస్తున్నాడు. జయ, పక్కనే నిల్చుని వడ్డిస్తోంది.

"అబ్బాయి చదువు విషయం ఏమిటాలోచించారండీ?" అంది జయ మెల్లగా.

"ఇందులో ఆలోచించడానికి ఏముంది జయా? కాలేజీలో ఇంటరు చదువుతాడు..." అన్నాడు స్వామి తాపీగా.

"ఏ కాలేజిలో...?"

"ఎందులో వాడికి సీటు దొరికితే, అక్కడే చదువుతాడు... దానికి పెద్దగా ఆలోచించడం ఎందుకు?"

"అదికాదండీ, వాడేమో, ఏదో కోచింగ్ సెంటర్లో చేరుతానంటున్నాడు." ఆశ్చర్యంగా భార్యకేసి చూశాడు, స్వామి.

"కోచింగు సెంటర్లోనా? ఇప్పుడెందుకు?" అన్నాడు.

"ఎందుకేమిటండీ? వాడు, ఇంజనీరింగు చదువుతాడట..."

"ఏదో తరగతి ఫస్టుక్లాసులో పాసైన వాళ్లంతా, ఇంజనీరింగూ చదువుకోవాలనుకుంటే, అది సాధ్యమా?"

"ఇప్పుడు చాలా మంది అలాగే చదువుతున్నారట కదండీ? వీడి స్నేహితులు కూడా చాలా మంది చేరుతున్నారట..."

స్వామి బరువుగా ఓ నిట్టూర్పు వదిలాడు.

"డబ్బున్న వాళ్లు అలా చేస్తే చెయ్యొచ్చును గాని, మనలాంటి సామాన్యులు అటువంటి ప్రయత్నం చెయ్యరు జయా! ఆ కోచింగు సెంటర్లు మనకి అందుబాటులో వుండవు. ఇలా ప్రతివాళ్లూ కోచింగు సెంటర్ల కోసం ఎగబడుతూ వుండటం వల్లనే, అటువంటి సెంటర్లు దినదిన ప్రవర్ధమానమవుతూ వర్ధిల్లుతున్నాయి. నిజమైన తెలివితేటలకి విలువే లేకుండా పోయింది." అంటూ చిన్న వుపన్యాసమిచ్చాడు స్వామి. అది కేవలం అతని వ్యక్తిగతమైన అభిప్రాయమే!

"మీరు అలా అనేస్తే ఎట్లాగండీ! అబ్బాయి, ముచ్చట పడుతున్నాడు. వాడే గనక ఇంజనీరైతే, లక్షలు సంపాదించ వచ్చునంటున్నాడు. అప్పుడు, మనకి మరెటువంటి లోటూ వుండదుకదండీ!" అంది జయ. కొడుకు విషయంలో సిఫారసు చేస్తూ.

స్వామి మెల్లగా నవ్వేడు.

"అవన్నీ వూహించడానికీ, చెప్పుకోవడానికీ, ఎంతో ఆకర్షణీయంగా వుంటాయి జయా. కాని, ఆచరణలో సాధ్యం కావు. కోచింగు సెంటరులో ఎంత డబ్బు కట్టాలో నీకు తెలుసా?" అన్నాడు స్వామి, చెయ్యి కడుక్కుంటూ.

"వాడికి తెలుసునండీ! ప్రతీ ఆరునెలలకీ పదిహేనువేలు వరకూ సుమారుగా కట్టాలంటకదా!"

"ఓహో... అదీ వాడే చెప్పాడన్నమాట! అంటే, వాడికి మన ఆర్థిక పరిస్థితులు తెలిసి కూడా, ఈ ప్రయత్నానికి పూనుకుంటున్నా డన్నమాట!" అన్నాడు స్వామి.

"ఇప్పుడు వాడి చదువుకోసం మనం అప్పు చేసినా, వాడు ఇంజనీరు అయ్యాక గడిస్తాడు కదండీ! అప్పుడు తీర్చేస్తాం..." అంది జయ, చాలా తేలిగ్గా. ఇంటి బాధ్యతలు ఆమె చూసుకోవడం లేదు కాబట్టి, అలా అనగలిగిందేమో!

"చూడు జయా! అబ్బాయి చెప్పిన మాటల్ని, నువ్వు చాలా తేలిగ్గా తీసుకుంటున్నట్టున్నావు. కాని, మాటల్లో అనుకున్నంత సులువు కాదు. అమ్మాయి పెళ్లికి చేసిన అప్పులే ఇంకా వున్నాయి. వడ్డీలు కట్టుకోలేక, సతమతమై పోతున్నాను. ఆ బరువే మోయలేకపోతుంటే, మళ్లీ వీడి చదువుకోసం అప్పులా? తెచ్చుకున్న జీతమంతా వడ్డీలకే పోతే, దైనందిన జీవితం ఎలా గడువుతాం చెప్పూ! వడ్డీ భారం పెరిగిపోతే, అసలు తీర్చేదెలా? ఎప్పుడు తీరుస్తాం? ఒక్కసారి నువ్వూ, అబ్బాయి తార్కికంగా ఆలోచించండి. అబ్బాయిని ఇంజనీరింగు చదివించడం, నాకూ ఆనందంగానే వుంటుంది. కానీ, అందుకు తగిన వనరులు మనకి వున్నాయో, లేవో, చూసుకోవాలి కదా! ఆశలు పెంచుకోవడం, తప్పుకాదు జయా! కాని, అత్యాశకు పోకూడదని నా అభిమతం. డబ్బులేని వాళ్లు ఇంజనీరింగు చదవలేదని నేను చెప్పను. అటువంటివారు నూటికి ఒక్కడుంటే వుండొచ్చు. అబ్బాయితో నేను మాట్లాడుతానులే...." అంటూ అక్కణ్ణించి నిష్క్రమించాడు స్వామి.

జయ, భర్త చెప్పిందాన్ని అవగాహన

చేసుకుంది. ఆలోచించిన మీదట, ఆయన చెప్పినట్లు, ఆయన జీతమంతా వడ్డీలకే పోస్తే, తాము జీవించేదెలా? అంతే కాదు సుఖశాంతులుంటాయా? తనలో తానే ఆ ప్రశ్నలు వేసుకుంది. పరిస్థితి అర్థమయ్యిందామెకి.

భారంగా ఓ నిశ్వాసం వదిలింది....

000

రాత్రి భోజనాలయ్యాక, చంద్రంని పిల్చాడు స్వామి. తన పక్కనే కూర్చోబెట్టుకున్నాడు. ఆశ్చర్యపోయాడు చంద్రం. ఏదో విశేషం వుందనుకున్నాడు.

అదే జరిగింది. భార్యకి చెప్పిందంతా, ఒక్క అక్షరం విడిచిపెట్టకుండా, కొడుక్కి చెప్పాడు, స్వామి.

"ఒరేయ్ అబ్బాయ్, ఉన్నది, వున్నట్లు చెప్పాను. అప్పులు చెయ్యడం సులువేరా చంద్రం. వాటికి వడ్డీలు కట్టడం, అసలు తీర్చడం, ఎంత కష్టతరమో, అనుభవించిన వాడికే తెలుస్తుంది. కేవలం వూహించినంత మాత్రాన అర్థం కాదు. అప్పులు, మనకి అందనంత ఎత్తుకి ఎదిగితే, అప్పుడు మన పరిస్థితి ఏమిటో వూహించుకోగలవా? మరో మార్గం లేక నేను పరారీ అవ్వాలి. అయినా, అప్పులవాళ్లు నిన్ను వదలరు. నీ జీవితం దుర్భరమవుతుంది. ఇవన్నీ ఆలోచించు, అప్పటికీ నువ్వు కోచింగు సెంటర్లో చేరాలనుకుంటే, చేరు..." ముగించాడు స్వామి.

చంద్రంకి, తండ్రి చెప్పిందంతా అర్థమయ్యింది. ఆయన చెప్పినట్టు అప్పుల ఊబిలో తండ్రిగాని, తానుగాని కూరుకుపోతే, పరిస్థితులు ఎలా వుంటాయో, లీలగా వూహించుకోగలిగాడు. ఒక్కసారి మనిషి చలించిపోయాడు. మొహమంతా స్వేదంతో నిండింది. రెండు చేతుల్తో మొహాన్ని తుడుచుకున్నాడు. తండ్రి చెప్పింది, 'అక్షరసత్యం' అనిపించింది.

"ఏమిట్రా ఆలోచిస్తున్నావు?" అన్నాడు స్వామి, కొడుకుని వుద్దేశించి.

చప్పున తేరుకున్నాడు, చంద్రం.

"అబ్బే! ఏమీ లేదు నాన్నా! నేను ఇంటర్లో చేరుతాను నాన్నా!" అన్నాడు చంద్రం.

"నిజం చెబుతున్నావా?" కొడుకు మొహంలోకి సూటిగా చూస్తూ అన్నాడు స్వామి.

"ఔను నాన్నా! నిజమే చెబుతున్నాను. ఇంటరులో చేరిపోతాను. అవకాశాలు లేకపోతే, అందలమెక్కాలని ప్రయత్నించడం, అడియాశే అవుతుందని తెలుసుకున్నాను. మీ పై ఒత్తిడి తెచ్చినందుకు నన్ను క్షమించండి నాన్నా!" అన్నాడు చంద్రం.

స్వామి తృప్తిగా నవ్వుకున్నాడు.

"చాలా సంతోషంరా చంద్రం. నా కొడుకు ఇంజనీరు కావాలన్న అభిలాష నాకూ వుంటుందిరా. కాని, మనం అతి సామాన్యులం. మన అభిలాషకి రూపకల్పన జరగడం కష్టం... ఏమైతేనేం నన్ను అర్థం చేసుకున్నావు. అంతే చాలు... ఇహ నువ్వెళ్లరా!"

చంద్రం, వుత్సాహంగానే అక్కణ్ణించి నిష్క్రమించాడు. జయ ఎదురయ్యింది

"ఏమయ్యిందిరా చంద్రం...?" ప్రశ్నించింది, కొడుకుని.

"కోచింగు సెంటర్లో చేరనమ్మా! కాలేజీలో ఇంటర్లో చేరతాను. ఇప్పుడే నాన్నతో చెప్పాను" అంటూ ముందుకి సాగిపోయాడు, చంద్రం.

జయ తృప్తిగా నవ్వుకుంది, సమస్య సులువుగా పరిష్కారమైనందుకు.

■

## మెర్సిడెస్-బెంజ్ కార్ల పుట్టుక

మెర్సిడెస్ కార్ల పేరు తెలియనివారు మనలో అరుదు. మెర్సిడెస్-బెంజ్ కార్లనే పేర్లున్న వీటికి ఈ పేరెలా వచ్చిందన్న విషయం తెలుసుకోదగిన విశేషమే. 1897లో ఆస్ట్రేలియన్ వ్యాపారవేత్త ఎమిల్ జెల్లినెక్ జర్మనీలోని డైమేలర్ ఫ్యాక్టరీలో తయారవుతున్న కారు కొనుక్కుని స్వదేశం ఫ్రాన్సుకు వెళ్లాడు. ఆ కారును చూసి ఫ్రాన్సు ప్రజలు ఎంతగానో మెచ్చుకున్నారు. ఎందరో ధనవంతులు అలాంటి కారు తమకూ వుంటే బాగుండునంటూ ఆసక్తిని ప్రదర్శించారట కూడా. ఆ ప్రజలు మోజుపడి మరీ తిలకిస్తున్న తన కారుతో టూరింగ్ కాంపిటీషన్‌లో పాల్గొనాలనిపించిందట జెల్లీ నెక్ మహాశయుడికి. పోటీలో పాల్గొనే సమయంలోనే ఆ కారుకు, తన తొమ్మిదేళ్ల ముద్దుల కూతురు 'మెర్స్' పేరు కలిసొచ్చేలా మెర్సిడెస్ అనే పేరు పెట్టుకున్నాడు. ఆ కారు పట్ల ప్రజలు చూపుతున్న ఆసక్తిని గమనించి మరో 36 కార్లకు ఆర్డర్ ఇచ్చారు. అంతే కాక డైమేలర్ కంపెనీకి చెందిన ఈ కార్లను వివిధదేశాల్లో విక్రయించేందుకు డీలర్ షిప్ కూడా తీసుకున్నాడు. అయితే తానీ కార్లను మెర్సిడెస్ పేరుతోనే అమ్మదలచాడని ఆయన పెట్టిన షరతును, డైమేలర్ అధినేతలు ఆనందంగా అంగీకరించారు. అటు తరువాత డైమేలర్ కంపెనీతో బెంజి కంపెనీ చేతులు కలపటం, రెండు కంపెనీల పేర్లూ కలిసొచ్చేలా మెర్సిడెస్-బెంజ్‌గా రూపొందాయవి.

బి.జి.

